క్లుప్తంగా

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ


పుస్తకాలు పొందిన విద్యార్థులతో ఎంఈవో సత్యనారాయణ

కె.కోటపాడు : ప్రభుత్వం విద్యాభివృద్ధికి అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎంఈవో సత్యనారాయణ అన్నారు. మండలంలో జోగన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థిపైనా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మేరీ మార్గరేట్, ఉపాధ్యాయుడు అప్పలనాయుడు, ఏపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు సూర్రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

90 మందికి ఉచిత వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పృథ్వీరాజ్

చోడవరం రూరల్: హృద్రోగుల కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 90 మందికి పరీక్షలు జరిపారు. ఉచితంగా ఈసీజీ, 2డి ఎకో,ఆర్‌సీఎస్ పరీక్షలు చేశారు. స్థానిక సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం పదిగంటలకు శిబిరాన్ని ప్రారంభించారు. కార్డియాలజిస్ట్ పృథ్వీరాజ్ రోగులను పరీక్షించి తగు సూచనలిచ్చారు. ఎనిమిది మందికి గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సలను విశాఖలోని కేర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకంలో నిర్వహించడానికి నిర్ణయించినట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

వైద్యం కోసం ఆర్థిక సాయం


త్యాగరాజుకు నగదు అందజేస్తున్న స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యులు

కె.కోటపాడు : గాయం కారణంగా కాలు పోగొట్టుకున్న మండల కేంద్రం కె.కోటపాడుకు చెందిన శివయ్య త్యాగరాజుకు వైద్య ఖర్చుల నిమిత్తం స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యులు శుక్రవారం రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. తోటి మనిషికి చేతనయినంత సాయం చేయడాన్ని బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆర్గనైజేషన్ సభ్యులు వీర్రాజు, గోపి ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్, భోగేష్, నాగేంద్ర, ధనశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: కొండలపాలెంలోని శ్రీకృష్ణ భగవాన్ ఆలయ 14వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యుడు గంగారాజు, రోలుగుంట పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కర్రి వీరునాయుడు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

చోడవరం రూరల్: ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని చోడవరం బార్ అసోసియేషన్ కార్యదర్శి గొర్లె కృష్ణవేణి అన్నారు. ఈ యాక్ట్ రద్దు చేయడం పట్ల శుక్రవారం స్థానిక కోర్టుల సముదాయంలో న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోన్యాయవాదులు గూనూరు లక్ష్మీనారాయణ, అల్లు గిరిధర్, కొల్లి శ్రీనివాసరా వు, చీపురుపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఈదురు గాలులు.. భారీ వర్షం

పలు ప్రాంతాల్లో శుక్రవారం ఈదురుగాలులు, పిడుగులతో కూడిన భారీ వర్షం పడింది. పంటపొలాల్లోకి నీరు చేరింది. రోడ్లు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ వర్షాల వల్ల మెట్టు దుక్కులకు మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.


పిడుగు పాటుకు దగ్ధమవుతున్న తాటిచెట్లు


గొలుగొండ మండలం కోడులపాలెంలో నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


మాకవరపాలెంలో కురుస్తున్న వర్షం


రోలుగుంటలో ..


మర్రిపాలెంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు


వడ్డాది-బీఎన్ రోడ్డులో కురుస్తున్న వర్షం


గొలుగొండ మండలం కొమిరలో విరిగి పడిన చెట్టు


చోడవరంలో కురుస్తున్న వర్షం

మాడుగుల/మాడుగుల రూరల్ : నియోజకవర్గ కేంద్రం మాడుగులలో శుక్రవారం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. అరటి పంటకు నష్టం ఏర్పడింది. ఈ నెలలో సాధారణ వర్షపాతం 141 మిల్లీ మీటర్లు, కాగా ఇప్పటికే 100 మిల్లీమీటర్లు నమోదయింది. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు ఢోకా ఉండదని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. సచివాలయాలల్లో విత్తనాలు కోసం రైతులు ఇప్పటికే రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నారు. విత్తనాల పంపిణీ జరగానే నారుమడులు వేసుకోవడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెద్ద ఎత్తున నీరు చేరి జలాశయాలు నిండు కుండల్లా మారాయి.

పిడుగు పాటుతో తాటి చెట్లు దగ్ధం

గొలుగొండ: మండల కేంద్రం గొలుగొండలో శుక్రవారం సాయంత్రం సుమారు గంట పాటు ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. స్థానిక గురుకుల కళాశాల ప్రాంతంలో పిడుగు పడడంతో ఆరు తాటిచెట్లు దగ్ధమయ్యాయి. జోగుంపేట, పాతమల్లంపేట, సాలికమల్లంపేట, కొత్తపాలెం తదితర ప్రాంతాల్లో వర్షంతో పాటు గాలులు అధికంగా వీచాయి. దీంతో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఈదురుగాలులు, వర్షం కారణంగా విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పది రోజుల నుంచి ఎండల తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది.

నాతవరం: మండలంలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. చెరువుల్లోకి ఓ మోస్తరుగా నీరు చేరింది. మర్రిపాలెం, ములగపూడి ,బెన్నవరం, డొంకాడ గ్రామాల్లో భారీ వృక్షాలు కూలి విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నాతవరం మెయిన్‌రోడ్డుపై భారీగా నీరు ప్రవహించింది. మర్రిపాలెంలో రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ పూడుకుపోవడం వల్ల పాఠశాల గేటు ముందు రోడ్డుపై నీరు ప్రవహించింది. దీంతో ఆ దారిలో రాకపోకలు సాగించిన వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ వర్షం వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కూలిన వృక్షం

మాకవరపాలెం: ఈదురుగాలుల కారణంగా మండలంలోని దుంగలవానిపాలెం జంక్షన్‌లో బస్టాండ్ వద్ద విశాఖ-నర్సీపట్నం ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న భారీ వృక్షం నేలకొరగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ జంక్షన్‌లో కూలేందుకు సిద్ధంగా ఉన్న వృక్షాలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఎండలకు అల్లాడిన ప్రజలకు గంటకుపైగా కురిసిన వర్షంతో ఉపశమనం లభించింది. ఎండిపోయే స్థితికి చేరుకున్న పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

దేవరాపల్లి: ఈదురు గాలులతో కూడి వర్షం పడడంతో మండలం కేంద్రం దేవరాపల్లితో సహా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపిచిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సుమారు ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికార్లు శ్రమించి రాత్రి ఏడు గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరాను పునురుద్ధరించారు.

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. ఈ వర్షం పంటలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

బుచ్చెయ్యపేట: మండలంలో ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. బుచ్చెయ్యపేట, రాజాం, విజయరామరాజుపేట,వడ్డాది తదితర గ్రామాల్లో పలు చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మధ్యహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ లైన్లపై పడిన చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

చోడవరంలో 20 మిల్లీమీటర్ల వర్షం

చోడవరం: చోడవరం పరిసరాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సుమారు 20 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తంచేశారు. చోడవరం, వెంకన్నపాలెం, గోవాడ, అంబేరుపురం, గంధవరం , లక్ష్మీపురం, దామునాపల్లి, జుత్తాడ పరిసర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా మధ్యాహ్నం నుంచి రాత్రి 8గంటల వరకూ వర్షం పడింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో చివరి దశలో ఉన్న మామిడి పంట నేలరాలిపోయింది. ఈ వర్షం ఖరీఫ్ వరి నారుమడులు సిద్ధం చేసుకోవడానికి ఎంతో మేలుచేసింది. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.


మాడుగులలో..


నాతవరం మెయిన్ రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు


నేలకూలిన భారీ వృక్షం


నీటితో కళకళలాడుతున్న పెద్దేరు జలాశయం


అంధకారంలో దేవరాపల్లి మెయిన్ రోడ్డు

సమస్యలపై శాఖల వారీగా ప్రతిపాదనలు


మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: మండలంలో ప్రధాన సమస్యలకు సంబంధించి శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తాండవ జంక్షన్ నుంచి మండల కేంద్రం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు, నాతవరం నుంచి తాండవ ప్రాజెక్టు స్పిల్‌వే గేట్ల వరకు ఇరిగేషన్ రోడ్డు, చమ్మచింత నుంచి సరుగుడు మధ్య ఆర్‌అండ్‌బీరోడ్డు, నర్సీపట్నం, తుని మధ్య హెచ్‌పీసీఎల్ నుంచి మన్యపురట్ల మధ్య తారు రోడ్డు నిర్మాణాలు, మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయా శాఖల జేఈలను ఆదేశించినట్టు చెప్పారు. తాండవ రిజర్వాయర్ మెయిన్‌గేట్ల లీకేజీలు అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని తాండవ ప్రాజెక్టు అధికారులకు సూచించారు. మండల వ్యాప్తంగా తాగునీటి సమస్య పరిష్కారానికి, తాండవ నిర్వాసితుల గ్రామమైన మాధవనగరం పంచాయతీలో తాగునీటి సమస్యపై చర్చించారు. వీటితో పాటు మండల వ్యాప్తంగా కాలనీల నిర్మాణాల బిల్లుల చెల్లింపులు తదితర అంశాలపై చర్చించారు. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలు, పంచాయతీరాజ్ శాఖ పనులపై కూడా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి పాలుపర్తి పార్థసారథి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ శాఖ, హౌసింగ్, ఆర్ అండ్‌బీ, తాండవ ప్రాజెక్టు జేఈలు రాజేష్, వెంకటేశ్వరమ్మ, జోగారావు, శ్యామ్‌కుమార్ కె.ఆర్.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారులకు వంద రోజులు పని


తామరంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రరావు

మాకవరపాలెం: ఉపాధి వేతనదారులకు వంద రోజుల పాటు పని కల్పించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో చంద్రరావు ఆదేశించారు. మండలంలోని తామరంలో జరుగుతున్న ఉపాధి పనులతోపాటు కామేశ్వరీనగర్‌లో ఉన్న నర్సరీని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్ షీట్లను తనిఖీ చేసి, కూలీలతో మాట్లాడారు. పనిప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి


మర్రివలసలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : వ్యాధులకు కారణమైన దోమల నివారణకు అందరూ చర్యలు తీసుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మర్రివలసలో వైద్య సిబ్బంది, విద్యార్థులతో కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలుతాయని చెప్పారు. వర్షాలు పడుతుండడం వల్ల నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. ఇంటి పరిశరాల్లో ఉన్న మురుగునీటి నిల్వలను తొలగించుకోవాలని. ప్రతి ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎన్ఎం స్వాతి, హెచ్.వి. భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్‌లు నర్సింహమూర్తి, పి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శనీయుడు చే గువేరా


చే గువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

చోడవరం రూరల్: విశ్వవ్యాప్త యువతకు చే గువేరా ఆదర్శనీయుడని ఆచార్య ముర్రు ముత్యాలునాయుడు అన్నారు. శుక్రవారం ఆర్క్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన చే గువేరా జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. చే గువేరా గొప్ప పోరాట యోధుడే గాకుండా మానవతా వాది అని, మంత్రిగా ఆయన చేపట్టిన సంస్కరణలు ప్రపంచ దేశాలకు అనుసరణీయంగా మారాయని చెప్పారు. ముందుగా చే గువేరా చిత్రపటాన్ని ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. ఆర్క్ సంస్థ కార్యదర్శి డి.ఎస్.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సామాజిక వేత్త, పలు సంఘాల వ్యవస్థాపకులు ఎస్.దేముడు, కన్స్యూమర్ ప్రొటెక్షన్ అసోసియేషన్ నాయకుడు టి.వి.రమణ, బి.వెంకటరావు, డిఫెన్స్ అకాడమీకి చెందిన గణేష్, ప్రేమసమాజానికి చెంది ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత ఆలయంలో ప్రత్యేక కుంకమ పూజలు


వాసవీమాతకు పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: మండలంలోని జంపెన వాసవీమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కుంకమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టా మోహన్‌రావు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. కింతలి గాదిరాయి వాసవీ క్లబ్ సభ్యులు, మహిళలు పూజల్లో పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో..

కేజే పురం జంక్షన్‌లో గల సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక కుంకమ పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

రక్తదానంతో ప్రాణదానం


మాట్లాడుతున్న కళాశాల కో ఆర్డినేటర్ రత్నభారతి

చోడవరం రూరల్: రక్తదానం చేయడమంటే ప్రాణ దానం చేసినట్టేనని, ఆ విధంగా రక్తదాతలందరూ ప్రాణదాతలుగా నిలస్తారని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ వి.రత్నభారతి అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని కళాశాలలో జాతీయ సేవా పథకం మూడు యూనిట్ల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానంపై అవగాహన సదస్సును జరిపారు. వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ ఈ సదస్సును ప్రారంభించారు. ప్రతి విద్యార్థి రక్తదానం పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని రత్నభారతి అన్నారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ బి.పిచ్చమ్మ మాట్లాడుతూ రక్తాన్ని దానం చేయడానికి మించిన దానమేదీ లేదన్నారు. మరో కోఆర్డినేటర్ డి.మాల్యాద్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు వి.అప్పలనాయుడు, సీహెచ్. జ్యోతి, ఎస్.సూర్యవతి, టి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో పట్నాయక్

కె.కోటపాడు : గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా, పారిశుధ్యం క్షీణించకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పట్నాయక్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు పడనున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మంచినీటి పథకాల క్లీనింగ్, క్లోరినేషన్ పనులతో పాటు పారిశుధ్యం మెరుగుకు ప్రాధాన్యతను ఇవ్వాలని తెలిపారు. సూపరింటెండెంట్ అప్పలరాజు, ఈవోఆర్డీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అల్లు శ్వేత, మండల ఇంజినీర్ బాలాజీ అప్పారావు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు


ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కుమారస్వామి

చోడవరం రూరల్: ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు లభిస్తుందని ఐఐటీ ధన్‌బాద్ కంప్యూటర్ ఇంజినీర్ అనకాపల్లి కుమారస్వామి అన్నారు. పట్టణ శివారు ఫకీర్ సాహెబ్ పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమంగా నిలిచిన ముగ్గురు విద్యార్థులను శుక్రవారం నగదు పురస్కారాలతో ఆయన సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ తన స్వగ్రామంలో పదవ తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులతో సత్కరించడం ద్వారా ఇతర విద్యార్థుల్లో మంచి మార్కులు సాధించాలన్న ఆసక్తిని కలిగించాలన్నదే తన కోరికన్నారు. విద్యార్థులు కె.ప్రణీత్, పి.తనూజ, ఎస్.వసంతలు వరుసగా మూడు స్థానాల్లో నిలవగా వరుసగా మూడు వేలు, రెండు వేలు, వెయ్యి రూపాయల నగదు, జ్ఞాపికలను అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సింహాచలం, ప్రధానోపాధ్యాయిని ఎల్.మీనాక్షి, ఎస్.వి.ఎస్.ఎస్.శర్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే గుర్తింపు రద్దు


ప్రైవేట్ పాఠశాలల యజమానులకు నోటీసులు ఇస్తున్న ఎంఈవో తలుపులు

నర్సీపట్నం: అధిక ఫీజులు వసూలు చేస్తే ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని ఎంఈవో సీహెచ్.తలుపులు తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించిన నలంద, శ్రీవిద్యాంజలి, అమరావతి, నారాయణ పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు అధిక ఫీజులు వసూలు చేసినా, పుస్తకాలు, యూనిఫాం విక్రయించినా జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లి గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న దాతలు

నర్సీపట్నం: స్థానిక ఏరియా ఆస్పత్రి బ్లడ్‌స్టోరేజ్ విభాగం, వీఎస్ఎస్ బ్లడ్ సర్వీసెస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఆస్పత్రి సూపరింటెంటెంట్ ఎం.నీలవేణిదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. వీఎస్ఎస్ బ్లడ్ సర్వీసెస్ గ్రూపు వారు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. 46 సార్లు రక్తదానం చేసిన వూడా సూర్యారావు, వీఎస్ఎస్ నిర్వాహకులు సందీప్‌ను ఆస్పత్రి వైద్యులు సన్మానించారు.